ప్రజాశక్తి

శనివారం 3 మే 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆదివాసీలకు అదానీ ముప్పు



అదానీ పంప్డు స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు అప్పర్ రిజర్వాయర్ ప్రదేశం

◆ రిజర్వాయర్లతో సాగు భూముల మునక
◆ జీవనాధారాలకు దెబ్బ ◆ ఎడారి కానున్న రైవాడ
◆ నోరు విప్పని ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లాలో తలపెట్టిన అదానీ ప్రాజెక్టుతో గిరిజనులకు పెను ప్రమాదం పొంచి ఉంది. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అదానీకి చెందిన 900 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు కోసం రెండు రిజర్వాయర్ల నిర్మాణాలకు రెండు ప్రదేశాలను ప్రాథమికంగా గుర్తించారు. వేపాడ మండలం మారిక కొండ, దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ కోరాడ పై భాగాన అప్పర్ రిజర్వాయర్, తామరబ్బ దగ్గర లోయర్ రిజర్వాయర్ నిర్మాణానికి అనువైన ప్రదేశాలు ఉన్నట్టు అంచనాకు వచ్చారు. ఎన్నికల ముందు బలిపురం వద్ద మట్టి నమూనాలు సేకరించినప్పుడు సిపిఎం అడ్డుకోవడంతో యంత్రాలు తీసుకొని వెనక్కు వెళ్లిపోయారు. గత ప్రభుత్వ నిర్ణయాలను యథాతథంగా అమలు చేయడంతో పాటు నిర్మాణ పనులకు ఆటంకాల్లేకుండా కూటమి ప్రభుత్వం అదానీకి నేడు సహకరిస్తోంది. 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టును భవిష్యత్తులో 900 మెగావాట్ల సామర్థ్యానికి విస్తరించే ఆలోచనతో రూ.2,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసింది. రెండు రిజరాయర్ల నిర్మాణంలోనూ ఆదివాసీ గ్రామాలను తరలించకుండా తప్పించి, భూములు కోల్పోయే నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించేలా డిజైన్ మార్చనున్నారు.

వేపాడ మండలం మారిక ప్రాంతంలో సామాజిక, ఆర్థిక సర్వే ఆధారంగా భూ సేకరణలో మార్పులు, చేర్పులు చేయనున్నారు. ఆదివాసీల నుంచి వ్యతిరేకత లేకుండా ముంపు విస్తీర్ణాన్ని వీలైనంత మేరకు తగ్గించాలన్న ఆలోచనలో వున్నట్లు కన్పించినా, ముంపు ఎక్కువగా వుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఫారెస్టు భూములను డి నోటిఫైచేసి అదానీకి అప్పగించి, ఆదివాసీల నుంచి తక్కువ భూములు సేకరించాలని ప్రయత్నిస్తున్నారు. అయితే పూర్తిస్థాయి సర్వే చేపట్టాక ఏయే గ్రామాల్లో ఎంత భూమి రిజర్వాయర్లలో పోయే అవకాశముందనేది ఒక నిర్ధారణకు వచ్చాక భూ సేకరణను వేగవంతం చేయనున్నట్లు తెలిసింది. రైవాడ ఎగువభాగానవున్న శారద నది పరివాహక ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ వపర్ ప్రాజెక్టు రిజర్వాయర్ల ఏర్పాటుతో రైవాడ కింద ఆయకట్టు, విశాఖ నగర మిగతా 2లో..

'ఉక్కు' సంకల్పం



వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద తలపెట్టిన రిలే దీక్షలు శుక్రవారమూ కొనసాగాయి. పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు దీక్షల్లో కూర్చున్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుని తీరుతామని స్పష్టం చేశారు.

సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాళేశ్వరంలో గోదావరి, ప్రాణహిత నదులు భూగర్భ సరస్వతి నదితో కలిసే పవిత్ర సంగమం వద్ద ప్రత్యేకంగా నిర్వహించబడే సరస్వతి పుష్కరాల కోసం వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. విశాఖపట్నం నుంచి డైరెక్టుగా కాళేశ్వరం వెళ్లి వచ్చేందుకు ఈ నెల 14, 16, 17 తేదీలలో విశాఖపట్నం ద్వారకా బస్సు కాంప్లెక్స్ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నామన్నారు. టికెట్ ధర ఒక మనిషికి సూపర్ లగ్జరీ బస్సుకు రూ. 2,500, అల్ట్రా డీలక్స్‌కు రూ.2,350, ఇంద్ర సర్వీస్‌కు రూ.3,000గా నిర్ణయించామన్నారు. టికెట్లు కావలసినవారు ఆన్ లైన్‌లోగానీ, ద్వారకా బస్ స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లోగానీ సంప్రదించాలని కోరారు. అదేవిధంగా 34 మంది కలసి వచ్చినచో వారికి అనుకూలమైన రోజున బస్సులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. యాత్రికులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225602, 99592 25594, 9052227083, 9100109731 ఫోన్ నెంబర్లను సంప్రదించాని కోరారు.

అదేవిధంగా గ్రూప్ - 1 మెయిన్ పరీక్షలు రాసే అభ్యర్థుల సౌకర్యార్థం మే 3 నుంచి,9వ తేదీ వరకు పెందుర్తి - ఆనందపురం మధ్య ప్రత్యేక బస్సులు నడపబడతాయన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

▶ వార్త 3లో..

అర్హులందరికీ ఉచిత గ్యాస్ వర్తింపజేయాలి

▶ వార్త 2లో..

భెల్ యాజమాన్యానికి సమ్మె నోటీసు

▶ వార్త 4లో..

మోడీ పర్యటనపై నిరసన

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అమరావతి శంకుస్థాపన కోసం వచ్చిన నేపథ్యంలో సిఐటియు జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పూర్ణా మార్కెట్, స్ప్రింగ్ రోడ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మోడీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఖండించారు. ఈ సందర్భంగా సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ గతంలో ప్రధానమంత్రి మోడీ అమరావతి శంకుస్థాపనకు వచ్చినప్పుడు గుక్కెడు నీళ్లు, తట్టెడు మట్టి తెచ్చి వెళ్లిపోయారని, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయంలో మోసం చేశారని విమర్శించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటనతో కార్మికులు తిరగబడగా, వారిని ఎదిరించలేక విఆర్ఎస్ ప్రకటించడం, కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగాలను తొలగించడం, బ్లాస్ట్‌ఫర్నేస్‌లను ఆపివేయడం, ముడిసరుకు స్టీల్‌ప్లాంట్‌కు రాకుండా అడ్డుకోవడం వంటి దుశ్చర్యలకు కేంద్ర ప్రభుత్వం మిగతా 2లో..

సింహాచలం ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలి

◆ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గరాదు ◆ త్రిసభ్య కమిటీకి సిపిఎం వినతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గత నెల 30న సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో గోడ కూలి ఏడుగురు మృత్యువాత పడిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఎం బృందం కోరింది. సింహాచలం ఘోర దుర్ఘటనపై ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీని శుక్రవారం విశాఖలోని సర్క్యూట్ హౌస్‌లో కలిసి వినతిపత్రం అందజేసింది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపాలని విన్నవించింది. ఈ మేరకు కమిటీ ఛైర్మన్ దృష్టికి పార్టీ నాయకులు పలు విషయాలు తీసుకెళ్లారు. సింహాచలం చందనోత్సవంలో రక్షణగోడ కూలిన ఘోర దుర్ఘటనలో ఏడుగురు భక్తులు అక్కడికక్కడే చనిపోవటం విశాఖ, రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవ నిర్వహణ, ఏర్పాట్ల పరిశీలనకు నియమించిన కమిటీ అన్నింటా విఫలమైందని తెలిపారు. ఆ కమిటీ తగిన పర్యవేక్షణ, నూతన నిర్మాణాల తనిఖీలు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు, అన్నిరకాల భద్రతా చర్యలు తీసుకొని ఉన్నట్లయితే ఈ దుర్ఘటన జరిగుండేది కాదని పేర్కొన్నారు. చందనోత్సవానికి భారీగా భక్తులు తరలివస్తారన్న విషయం ప్రభుత్వానికి తెలుసునన్నారు. చందనోత్సవానికి కేవలం కొన్ని రోజుల ముందు తగిన ప్లాన్ లేకుండా అతిపెద్ద గోడను నాసిరకంగా నిర్మించడం వల్ల అది కూలిపోయిందన్నారు. పెద్దఎత్తున అవినీతి జరిగిందనేది ఈ ఘటనను బట్టి అర్థమవుతోందన్నారు. కాంట్రాక్టర్, ఇంజినీర్లు, దేవాలయ అధికారులు, ఏర్పాట్ల కోసం నియమించిన మంత్రుల కమిటీ.. ఇలా అందరి నిర్లక్ష్యం వల్ల ఇంతటి ఘోర దుర్ఘటన జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రుల కమిటీ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిందని తెలిపారు. అందువల్ల వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చందనోత్సవం ఏర్పాట్లుపై ఎప్పటికప్పుడు సమీక్షలు చేయడంలో విఫలమైందన్నారు. చందనోత్సవ ఏర్పాట్లులో భారీగా అవినీతి జరిగిందని తెలిపారు. ప్రసాద్ పథకం కింద చేపట్టిన రూ.54 కోట్లకుపైగా పనులన్నీ అత్యంత నాసిరకంగా ఉన్నాయన్నారు. ఈ అవినీతి ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా జరిగిందని భావించడం లేదన్నారు. వీటన్నిటిపై విచారణ జరపాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటివి చోటుచేసుకోకుండా తగిన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డాక్టర్ బి.గంగారావు, ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.జగన్, పార్టీ సీనియర్ నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు ఉన్నారు.



గోడ కూలిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సిహెచ్.నర్సింగరావు, జగ్గునాయుడు తదితరులు

ఘటనా స్థలాన్ని పరిశీలన

సింహాచలంలో గోడ కూలిన ప్రదేశాన్ని సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్ తదితరులతో కూడిన బృందం శుక్రవారం పరిశీలించింది.

మొదటి పేజీ తరువాయి..

ఆదివాసీలకు అదానీ ముప్పు

ప్రజలకు తాగునీటి సౌకర్యం సమస్య ఏర్పడ్డంతో తలెత్తే సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించేలా స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలను ప్రభుత్వం రంగంలోకి దించాలని ప్రయత్నిస్తోంది.

రైవాడకు వచ్చే నీటిని కిందకు వదలకుండా ఆ ప్రాంతంలో నిర్మించే రిజర్వాయర్లలో నీరు నిల్వ చేయనున్నారు. రిజర్వాయర్లలో సరిపడా నీరులేని సమయాల్లో పైభాగం నుంచి వచ్చే నీటిని ఈ రిజర్వాయర్లకు మళ్లించనున్నారు. దీనివల్ల రైవాడకు వచ్చే నీటి పరిమాణం తగ్గుతుంది. అలాగే పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు రిజర్వాయర్లతో గిరిజనుల వ్యవసాయ భూములు ముంపునకు గురికానున్నాయి. జీడి, మామిడి, వరి, ఇతర పంటలు ఇక్కడి ఆదివాసీలు సాగుచేస్తున్నారు. ఇవి ముంపుబారినపడితే వారి జీవనాధారం పోతుంది. అప్పర్, లోయర్ రిజర్వాయర్లతో చింతలపూడి పంచాయతీలోని చింతలపూడి, వంతెవానిపాలెం, కొత్తూరు, కోరాడ, మదనగరువు, నేరేళ్లపూడి, బోడిగరువు, సమ్మిద, వీరభద్రపేట, బల్లిపురం, కుక్కిలబందతో పాటు తామరబ్బ పంచాయతీలోని తొమ్మిది గ్రామాలు, వేపాడ మండలం మారిక కొండ చుట్టూవున్న కొండగంగుపూడి పంచాయతీలోని 10 గ్రామాలపై ప్రభావం పడనుంది. ప్రస్తుతం మారికకొండ కిందనున్న వాగుల నుంచి వచ్చే నీరు శారద నదిలో కలుస్తోంది. భవిష్యత్తులో ఈ వాగుల నీరు శారదలోకి రాకుండా పోతుంది. పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టులతో ఆదివాసీలకు, ఆయకట్టుకు కాలక్రమంలో తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. ముంపు గ్రామాల్లోని ఆదివాసీల బతుకుదెరువు పోతుంది. తమ సాగులోని పొలాలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడుతుంది.



నిరసన తెలుపుతున్న నాయకులు, ముఠా వర్కర్లు

మోడీ పర్యటనపై నిరసన

పాల్పడిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఇంతటి ద్రోహం చేసిన నరేంద్ర మోడీ ఏ ముఖం పెట్టుకొని రాష్ట్రానికి వస్తున్నారని, ఆయనను చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఎలా ఆహ్వానిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కర్రి చంద్రశేఖర్, ఎం.సుబ్బారావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మీ హయాంలో జరిగిన ప్రమాదాలు కూడా

రాజకీయ హత్యలేనా? : గంటా

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: చందనోత్సవంలో సింహాచలం కొండపై గోడ కూలిన సంఘటనను రాజకీయ హత్య అంటున్న వైసిపి మరి వారి ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రమాదాలను కూడా రాజకీయహత్యలుగా ఒప్పుకుంటుందా అని గంటా శ్రీనివాసరావు ప్రశ్నించారు. శుక్రవారం ఎంవిపి కాలనీలో ఆయన స్వగహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ఫార్మా కంపెనీలు ఇచ్చే నష్ట పరిహారంతో చందనోత్సవం గోడకూలిన ఘటనకు ఇచ్చిన పరిహారాన్ని పోల్చడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎసెన్షియా ఫార్మా, సినర్జీ యాక్టీవ్ కంపెనీ ప్రమాదాల్లో మతులకు కోటి రూపాయల చొప్పున పరిహారాన్ని అందించామన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా ఆక్సిజన్ అందక రుయా ఆస్పత్రిలో 11 మందికి దేవీపట్నం బోటు ప్రమాదంలో 12 మందికి, అన్నమయ్య ఆనకట్టగేట్లు కూలి మృతి చెందిన 39 మందికి రూ.10 లక్షల చొప్పున మాత్రమే వైసిపి ప్రభుత్వం పరిహారాన్ని అందించిన విషయాన్ని ఆ పార్టీ నాయకులు గుర్తు చేసుకోవాలన్నారు. బాధ్యత గల రాజకీయ పార్టీగా వైసిపి నాయకులు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాల్సి ఉండగా సున్నితమైన చందనోత్సవం దుర్ఘటనను కూడా ఇలా రాజకీయలబ్ధికి వాడుకోవడం ఆ పార్టీ దిగజారుడు తనానికి నిదర్శమన్నారు.

పరిశుభ్రతపై ప్రచార ర్యాలీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పరిశుభ్రత ప్రధానమంటూ హార్పిక్ హైనా పేరుతో రెకిట్ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెకిట్ హైజిన్ విభాగ మార్కెటింగ్ డైరెక్టర్ గౌతమ్ రిషి మాట్లాడుతూ బాత్రూమ్ క్లీనర్‌గా హార్పిక్ ప్రసిద్ధి చెందిందన్నారు.

అర్హులందరికీ ఉచిత గ్యాస్ వర్తింపజేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఉచిత గ్యాస్ నగదు అందరికీ వేయాలని, కొందరికే వేయడం సరికాదని, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఉచిత గ్యాస్ అందరికీ అందనందుకు నిరసనగా కృష్ణ గార్డెన్స్ రామాలయం వద్ద మహిళలు ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఉచిత గ్యాస్ నగదు అందని వారందరికీ వెంటనే డబ్బులు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఒక్కహామీని కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. గ్యాస్ సబ్సిడీ కేవలం నూటికి 30 మందికి మాత్రమే అందించి, మిగిలిన వారికి ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. అంతేకాక గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం దుర్మార్గమని విమర్శించారు. అదే విధంగా ప్రతి మహిళఖాతాలో నెలకు రూ.1500వేస్తామని చెప్పిన హామీని నీరు గార్చారని, ఇప్పటి వరకు కనీసం రూ.15కూడా జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత బస్సు సౌకర్యం కూడా అమలులో లేదని ఆక్షేపించారు. నిరసనలో భాగంగా మహిళలు డిమాండ్లతో కూడిన ప్లకార్డులు, గ్యాస్‌సిలిండర్ల కళారూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో స్థానిక సిఐటియు నాయకులు కర్రి గణేష్, లెనిన్, అమ్మాజీ, అరుణ,లక్ష్మి, సరోజినీ,వెంకటలక్ష్మి, పార్వతి,కాంతం, రామయమ్మ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మహిళలు

ఘనంగా హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ వేడుకలు

ప్రజాశక్తి-ఎంవీపీ కాలనీ: స్టాక్‌బ్రోకింగ్‌లో ప్రవేశించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ ఉద్యోగులు శనివారం విశాఖలో వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హెచ్‌డిఎఫ్‌సి బీమా విభాగం సమన్వయకర్త లెగసీ మాట్లాడుతూ సంస్థ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశమంతటా ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించే లక్ష్యంతో సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా 'నో యువర్ మనీ' అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తు న్నామని తెలిపారు. 2000 సంవత్సరంలో సంస్థ కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుండి హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ అద్భుతమైన అభివద్ధిని సాధించిందని, ఈ 25 ఏళ్లలో సంస్థ బ్రోకరేజ్ ఆదాయం రూ.3.5 కోట్లతో ప్రారంభమై రూ.1260 కోట్లకు చేరుకుందని ఆయన అన్నారు. అదేవిధంగా రూ.7.7 కోట్లతో ప్రారంభమైన సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరానికి గాను రూ.3,265 కోట్లకు చేరుకుందన్నారు. దేశవ్యాప్తంగా తమ సంస్థకు 6.8 మిలియన్ల వినియోగ దారులు ఉన్నారని 2025 మార్చి 31 నాటికి 134 శాఖల ద్వారా 3,647 మంది ఉద్యోగులతో సేవలందిస్తు న్నామని తెలిపారు. హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ బ్యాలెన్స్ షీట్ నాణ్యత, నిర్వహణ సేవలందిస్తుందని దేశవ్యాప్తంగా ఎంతో మందిని మరింత శక్తివంతం చేయడానికి సహ కరిస్తుందని తెలిపారు.

సమస్యల బేజారు

- ఆరుబయటే దుకాణాలు, రోడ్డుపైనే పార్కింగ్
- సరిపడా స్టాళ్లు, సౌకర్యాలు లేక రైతుబజారులో ఇబ్బందులు
- పార్కింగ్ లేక కొనుగోలుదారులకు పోలీసు కేసుల బెడద
- అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా పట్టించుకోని వైనం



రైతుబజారు లోపల ఇరుకు మార్గంలో ఆరుబయటే కూరగాయలు అమ్ముతున్న రైతు

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోనే రెండో అతి పెద్దదైన సీతమ్మధార రైతుబజార్‌లో సవాలక్ష సమస్యలు కొలువుదీరి ఉన్నాయి. కొన్నేళ్లుగా దీన్ని నిర్వహిస్తున్నా, ఇక్కడ రైతులకు సరిపడా స్టాల్స్ లేకపోగా, ఆరుబయటే కూరగాయలను పోగులుగా వేసి అమ్ముకోవాల్సి ఉంది. ఇక మిగిలిన సరుకులను నిల్వ ఉంచుకునేందుకు ఇక్కడ సదుపాయాలు లేవు. వర్షాలు, ఎండాకాలంలో రైతులు నానా అవస్థలు పడే పరిస్థితి ఉంది. కొనుగోలుదారుల వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్డు పక్కనే నిలిపేయాల్సిన పరిస్థితుల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండగా, ఇవేవీ పట్టించుకోని పోలీసుల కేసులు పెడుతూ, జరిమానాలు విధించడం వినియోగదారులకు తలనొప్పిగా మారింది. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోగా, గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ప్రస్తుత ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు.

సీతమ్మధార రైతు బజారులో 152 స్టాల్స్ ఉండగా, కొన్నింటిని కమర్షియల్ వ్యాపారులకు స్టాల్స్‌ను కేటాయించడంతో మిగిలిన వాటిని రైతులకిచ్చారు. 296 మంది రైతులు ఉండడంతో ఉదయం పూట 106 మందికి, సాయంత్రం పూట 96 మందికి వంతుల వారీగా స్టాల్స్‌ను కేటాయించారు. దీంతో ఆయా వేళల్లో అమ్ముడుపోగా, మిగిలిన సరుకులను భద్రపరచుకోవడం రైతులకు తలనొప్పిగా మారింది. రైతుబజారులో స్టాళ్లలో నిల్వచేసుకునే సదుపాయం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి కాయగూరలను అమ్మకానికి తెచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారంతా వాపోతున్నారు. సీతమ్మధార రైతుబజారులో రైతుల ద్వారా నెలసరి రూ.ఐదు లక్షల వరకు వివిధ రూపాల్లో ఆదాయం సమకూరుతున్నప్పటికీ, వారికి సౌకర్యాల కల్పనలో మార్కెటింగ్ అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి.



రైతుబజారును ఆనుకుని రోడ్డుపైనే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్

కొనుగోలుదారులకు తప్పని కష్టాలు

రైతుబజారులో వసతి, సౌకర్యాలు లేమితో రైతులు ఇబ్బందులు పడుతుండగా, కూరగాయలు కొనేందుకు వచ్చిన వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదు. ముఖ్యంగా రైతుబజారుకు బైకులపై వచ్చేవారికి పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. రైతుబజారును ఆనుకుని, రోడ్డుపక్కనే వాహనాలను నిలపక తప్పని పరిస్థితుల్లో వాటిని పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇదే అదనుగా పోలీసులు ఫొటోలు తీసి, కేసులు రాసేస్తుండడం, జరిమానా చెల్లించాలని ఇ-చలానాలు పంపుతుండడంతో కొనుగోలుదారులు తలలు పట్టుకుంటున్నారు. బయట మార్కెట్‌తో పోలిస్తే తక్కువ ధరకు తాజా కూరగాయలు దొరుకుతాయని రైతు బజారుకు వస్తే, పోలీసుల కేసులతో అంతకు మించిన ఖర్చు అవుతోందని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు ప్రజలు, పోలీసులు వాగ్వాదం చేసుకునే పరిస్థితీ ఉంది. పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోగా, విషయం తెలిసిన పోలీసులు ఇలా కేసులు రాయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొనుగోలుదారులు రైతు బజారు కు రావాలో, వద్దో పోలీసులు, అధికారులు చెప్పాలని ప్రశ్నిస్తున్నారు.

ఆక్సిజన్ టవర్స్‌తో కొత్త సమస్యలు

ఇదిలా ఉంటే సీతమ్మధార రైతుబజారును ఆనుకుని ఉన్న ఆక్సిజన్ టవర్‌లోని కొందరు నివాసితుల చర్యలతో సమస్యలు వస్తున్నాయి. అపార్ట్‌మెంట్ వాసులు సీసాలు, ఇతర వ్యర్థాలను నేరుగా కిందన పడేస్తుండడంతో అవన్నీ రైతుబజారుపైనే పడడంతో రైతులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాల్లో వీటి వల్ల కొందరికి గాయాల య్యాయనే ఆందోళన వ్యక్తమౌతున్నా, సంబంధిత మార్కెటింగ్ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అమలుకు నోచుకోని ఎమ్మెల్యే హామీ

సీతమ్మధార రైతుబజారులో నెలకొన్న సమస్యలపై గతంలో ఎమ్మెల్యేగా ఉన్నపుడే ప్రస్తుత ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు రైతులు విన్నవించగా, జి ప్లస్ టు విధానంలో స్టాళ్లను నిర్మిస్తామని హామీనిచ్చారు. అయితే నాటి నుంచి నేటివరకు అది అమలుకు నోచుకోలేదు. దీంతో ఇంకెవరి చెప్పకోవాలంటూ రైతులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెటింగ్ శాఖ అధికారులు జి ప్లస్ టు నిర్మాణ పనులు చేపట్టే సెల్లార్‌లో పార్కింగ్, రైతులకు రెండు ఫ్లోర్లలో సరిపడా సౌకర్యాలతో స్టాళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎస్టేట్ అధికారి వివరణ

దీనిపై రైతుబజారు ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి వివరణ కోరగా, రైతుబజారులో స్టాళ్ల కొరత, ట్రాఫిక్ సమస్య ఉండటం వాస్తవమని, ఇది ఉన్నతాధికారుల దృష్టిలో ఉందన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

- అయ్యప్పనగర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి
- కొమ్మాది కూడలిలో పెయింటర్ మృత్యువాత



పద్మావతి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్/ సీతమ్మధార : విద్యుదాఘాతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని దుర్మరణం పాలైన ఘటన కంచరపాలెంలోని ఐదవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మురళీనగర్ అయ్యప్ప నగర్ చోటుచేసుకుంది. శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఈ విషాదఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. అయ్యప్పనగర్ వర్మ కాంప్లెక్స్ వద్ద ఓ అపార్ట్మెంట్ రెండో ఫ్లోర్‌లో జివి పద్మావతి(29) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఎంఇఎస్ కంపెనీలో పనిచేస్తున్న తన భర్త అజయ్‌తో నివాసముంటోంది. ఎప్పటిలాగే. శుక్రవారం ఉదయం టెలిఫోన్ వైరుకు కట్టిన బకెట్‌లోని పాలుప్యాకెట్లు, ఇతర నిత్యావసర వస్తువులను రెండో అంతస్తులోని తన ఫ్లాట్ నుంచి లాగుతుండగా, పద్మావతి లాగుతున్న వైరు హైటెన్షన్ విద్యుత్ లైన్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త అజయ్ సమాచారం మేరకు కంచరపాలెం ఎస్ఐ సమీర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సిసి ఫుటేజీలో రికార్డైన దృశ్యాలు ఆధారంగా విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి కెజిహెచ్ తరలించారు. ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారి సెంట్రల్ లైట్ల వైర్లు తగిలి...



కృష్ణకుమార్ మృతదేహం

మధురవాడ : కొమ్మాది కూడలిలో ప్రధాన రహదారి దాటుతుండగా, రోడ్డు సెంట్రల్ లైటింగ్ విద్యుత్ వైర్లు తాగడంతో దొడ్డి కృష్ణకుమార్ (40)అనే పెయింటర్ మృత్యువాత పడ్డాడు. పిఎం.పాలెం సిఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, జివిఎంసి ఐదోవార్డు వైఎస్ఆర్ కాలనీకి చెందిన కృష్ణకుమార్, భార్య సునీత, కొడుకు, కూతురితో నివాసముం టున్నారు. గురువారం రాత్రి కొమ్మాది కూడలిలో రోడ్డును క్రాస్ చేసే క్రమంలో సెంటరింగ్ లైట్లకు వున్న విద్యుత్ వైర్లు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. కిందన పడిన ఆయనను వెంటనే గాయత్రి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృత్యువాత పడినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుని భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బాలకృష్ణ తెలిపారు.

ఆరిలోవ ఎఎస్ఐ రమణ మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ పోలీస్టేషన్ శాంతి భద్రతల విభాగంలో పనిచేస్తున్న ఎఎస్ఐ కె.వి.రమణ గురువారం రాత్రి అప్పుఘర్‌లో తన నివాసం వద్ద మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న రమణ సిక్ లీవ్‌లో ఉన్నారు. ఇటీవలే విధుల్లో చేరారు. రెండు రోజుల క్రితం సింహాచలం చందనోత్సవంలో విధులు నిర్వర్తించారు. అందరితో మంచిగా ఉండే రమణ మరణంపై సిఐ మల్లేశ్వరరావు, తోటి ఉద్యోగులు సంతాపం తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



నాటుసారా నిందితురాలితో పోలీసులు


ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం, జమ్మాదులపాలెం గ్రామ శివారు కరకవారి పాకల వద్దన నాటు సారా విక్రయాలు జరుగుతున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. నాటుసారా అమ్ముతున్న కరక చిలకమ్మ నుండి 2 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేసి, కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ దాడులులో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌వి.నారాయణ, ఎంవిఎస్.రమేష్, ధనలక్ష్మి, శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ వాణిజ్యంపై 'గీతం'లో చర్చ

ప్రజాశక్తి- మధురవాడ : అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్ సహ అగ్రరాజ్యాల మధ్య ప్రస్తుతం జరుగుతున్న పన్నుల యుద్ధం, వాటి ప్రభావంపై ఎంబిఎ విద్యార్థులకు అవగాహన కలిగించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో శుక్రవారం వాణిజ్య నిపుణులతో చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పన్నుల పెంపు ప్రభావం ఆయా దేశాలపై ఎలాంటి మార్పులను తీసుకువస్తోందో చర్చించారు. పన్నుల పెంపు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, కార్మిక చట్టాలు, వాణిజ్య అసమతుల్యతలు, పర్యావరణ అంశాల వంటివి ప్రధానంగా ఈ చర్చలలో చోటుచేసుకున్నాయి. గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ కె.లుబ్జా నిహార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ సంస్థ ఎక్స్‌పోర్ట్స్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (ఇసిజిసి) అధికారి పి. అసిత్‌కుమార్, ఎలైట్ లాజిస్టిక్స్ సిఇఒ రవిశంకర్, గీతం అంతర్జాతీయ వాణిజ్య విభాగం ఛైర్‌పర్సన్, కార్యక్రమ కోఆర్డినేటర్ డాక్టర్ రాధారఘు రామ పాత్రుని, డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

అన్నసమారాధన


ప్రజాశక్తి-గాజువాక : సుందరయ్య కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయ దశమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం, భారీ అన్నసమారాధన నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు, డిసిసిబి ఛైర్మన్ కోన తాతారావు, ఆలయ కమిటీ పెద్దలు నాయుడు, సతీష్, కె. వీరస్వామి, వానపల్లి జగ్గారావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



అన్నసమారాధనలో పాల్గొన్న నేతలు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత

- చేపల వేట నిషేధభృతి పంపిణీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమిలిలో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఆవిర్భావం నుంచి మత్స్యకారులతోపాటు వృత్తిదారుల సంక్షేమానికి టిడిపి పెద్దపీట వేస్తోందనిస్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'మత్య కారుల సేవలో' పథకం కింద వేట నిషేధభృతిని గత ప్రభుత్వం కంటే రెట్టింపు చేసి, ఒక్కొక్కరికీ రూ 20 వేలు చొప్పున కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జివిఎంసి 3,4 వార్డులతోపాటు మండలంలోని చేపలుప్పాడ, మంగమారిపేట, అన్నవరం, పెద నాగమయ్యపాలెం గ్రామాలకు చెందిన 2025 మంది మత్స్యకార లబ్ధిదారులకు రూ 4.50కోట్ల వేటనిషేధభృతి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మత్స్యకారులతో పాటు చేనేత, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి తదితర వర్గాల ప్రజలకు టిడిపి అండగా ఉంటోందన్నారు. కార్యక్రమంలో మత్యశాఖ జెడి పి లక్ష్మణరావు, ఎడి ఎ విజయకృష్ణ, మత్యశాఖ అభివద్ధి అధికారి డి.లావణ్య, తహశీల్దార్ పైలా రామారావు, జెడ్సి బమ్మి అయ్యప్పనాయుడు, గ్రామ మత్య సహాయకులు, సాగర మిత్రలు, టిడిపి నాయకులు గంటా నూకరాజు గొలగాని నరేంద్రకుమార్, కారి అప్పారావు, పాసి నరసింగరావు, ఎ గుర్నాధరావు, కొక్కిరి అప్పన్న, సంజీవ్, జి పోలిరాజు, చురకల రమణ పాల్గొన్నారు. అనంతరం సిఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు

తర్లువాడకు రోడ్డుకు నిధులు మంజూరుపై హర్షం

ఆనందపురం: జాతీయ రహదారి నుంచి తర్లువాడ గ్రామానికి రహదారి నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరుపై సర్పంచ్ బిఆర్బి నాయుడు, స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. తర్లువాడ రోడ్డుకు నాబార్డు నిధులు మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆయన స్వగృహంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. తర్లువాడ ఐటి హబ్ ఏర్పాటుకు 250 ఎకరాలు కేటాయించి నేపథ్యంలో హైవే నుంచి ఆనందపురం, బాకురుపాలెం కలిసే రోడ్డు వరకు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్డును ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ నాయుడు తెలిపారు మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, తాట్రాజు అప్పారావు, బంకు రాజు, మజ్జి శ్రీను, సన్యాసిరావు, చందల అప్పలరాజు , అప్పయ్యమ్మ, కొండ్రు శంకర్, గణేష్ పాల్గొన్నారు.

భెల్ యాజమాన్యానికి సమ్మె నోటీసు



సమ్మె నోటీస్ అందజేస్తున్న ప్రకాశ్, ఆనంద్,తదితరులు

ప్రజాశక్తి- గాజువాక : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు డిమాండ్తో దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు పిలుపుమేరకు, ఈనెల 20న భెల్లోని అన్ని అసోసియేషన్లు సమ్మె చేయనున్నట్లు భెల్ ప్రోగ్రెసివ్ ఫ్రంట్ (ఐఎన్టియుసి, సిఐటియు) నేతలు వెల్లడించారు. సమ్మెలో పాల్గొనేందుకు వీలుగా శుక్రవారం యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. నోటీసును భెల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జిసుబ్రహ్మణ్యానికి ఫ్రంట్ నాయకులు జిటిపి ప్రకాష్, సీతన్న నాయుడు, పి ఆనంద్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో కార్మిక నేతలు ఆర్ జనార్ధనరావు, వి ఆనందరావు, బి.కృష్ణమూర్తి ప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలు కోర్సుల్లో ప్రవేశాలకు
28లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఆరిలోవ : దయాల్బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్లో పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 28లోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల డిప్లమా ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ కోర్సులో ప్రవేశానికి టెన్త్ ఉత్తీర్ణులై 22ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎస్సి, ఎస్టిలకు మూడేళ్లు వయో సడలింపు ఉంటుందని, 25ఏళ్ల వరకు అర్హులేనన్నారు. మూడేళ్ల. బిబిఎ(ఆన్లైన్ కోర్సు)కు ఇంటర్మీడియట్ పాసై ఉండాలని, వయోపరిమితి లేదు. అగ్రికల్చరల్ టెక్నాలజీలో బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్ మూడేళ్ల కోర్సుకు ఇంటర్మీడియెట్ బైపిసి, ఎంపిసి అభ్యర్థులు అర్హులని, వీరికీ వయోపరిమితి లేదన్నారు. దరఖాస్తులను ఈనెల 28లోగా విశాలాక్షినగర్లోని ఇడిఐ ఇన్ఫర్మేషన్ సెంటర్, దయాల్బాగ్లో ఇవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు 99633 40611 ఫోన్ నెంబరుకు సంప్రదించవచ్చున్నారు.

బీమా కార్డుల పంపిణీ



బీమా కార్డులు అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి -ఆనందపురం : జనసేన క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న వారికి పార్టీపరంగా ఇస్తున్న బీమా నమోదు కార్డులను శుక్రవారం మండలంలోని గోట్టిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో లబ్ధిదారులకు మండల ఉపాధ్యక్షులు తాడివాడ శివకృష్ణ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు తమ్మిన అప్పలరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ జనసేన సభ్యత్వం, ప్రమాదబీమాతో ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శాకరి శీనుబాబు, వెన్ని. నాయుడు, జానా అప్పలకృష్ణ, దొంతల వెంకటేష్, మహేష్, పవన్కుమార్, వాసు హేమంత్కుమార్ భార్గవ సూరి, బంగారు నాయుడు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడలో నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో దివీస్ సంస్థ అధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన 41 మంది మహిళలకు సంస్థ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వర రావు, ఎంఎస్ఎన్ రావు శుక్ర వారం సర్టిఫికెట్లు అందజేశారు. అలానే కుట్టుమిషన్ టూల్ కిట్లు పంపిణీ చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అన్నవరం, చిప్పాడ, మూలకుద్దు, అమనాం గ్రామాల మహిళలు, సిఎస్ఆర్ బృంద సభ్యులు డి సురేష్కుమార్, ఎ.శ్రీనివాస్, పి శేఖర్ బాబు, కె నరసింహారావు పాల్గొన్నారు

ఫలించిన సిపిఎం పోరాటం

- ఎట్టకేలకు శాంతిగిరి కాలనీకి విద్యుత్ కనెక్షన్, వీధిదీపాల ఏర్పాటు
- జివిఎంసి, విద్యుత్ అధికారులకు సిపిఎం, ఐద్వా నేతల అభినందన

ప్రజాశక్తి -ములగాడ: సిపిఎం పోరాటం ఫలించింది. ఆరేళ్లతర్వాత ఎట్టకేలకు జివిఎంసి 59వ వార్డు శాంతిగిరి కాలనీకి విద్యుత్ లైనుకు సరఫరా ఇవ్వడంతోపాటు విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. దీనిపై సిపిఎం, ఐద్వా నేతలు హర్షం వ్యక్తం చేస్తూ, విద్యుత్శాఖ, జివిఎంసి అధికారులకు అభినందనలు తెలిపారు.

జివిఎంసి 59వ వార్డు శాంతిగిరి కాలనీకి ఆరేళ్ల క్రితమే విద్యుత్ స్తంభాలను వేసి వైర్లను బిగించారు. అయితే ఇన్నేళ్లయినా విద్యుత్ సరఫరాను మాత్రం ఇవ్వలేదు.దీనిపై సిపిఎం ఆధ్వర్యంలో శ్రీహరిపురం విద్యుత్ సబ్స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి, విద్యుత్ అధికారి దుర్గాప్రసాద్, ఎఇకి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు, ఎట్టకేలకు శాంతిగిరికాలనీకి వేసిన విద్యుత్ వైర్లకు సరఫరానిచ్చారు.అలాగే వీధిదీపాలు వెలిగించారు. దీనిపై సిపిఎం జోన్ నాయకులు ఆర్ లక్ష్మమూర్తి ఏరియా నాయకులు బూడి. శ్రీను, దున్న రాజేష్ తదితరులు హర్షం వ్యక్తంచేసి, విద్యుత్ అధికారి దుర్గాప్రసాద్, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అయితే గృహ విద్యుత్ కనెక్షన్ల సర్వీసు వైర్లు ఒక్కో స్తంభానికి ఎక్కువేసి ఉండడం వల్ల గాలివాన సమయంలో ఎటువంటి ప్రమాదం జరగకుండాతగు చర్యలు చేపట్టాలని ఐద్వా నేతలు బి జ్యోతి, కళ్యాణి, వెంకటలక్ష్మి, శ్రీదేవి సంతోషి కోరారు.

నేడు జిఓ 30పై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : జిఓ 296, 388 ప్రకారం చంద్రన్న పట్టాల రిజిస్ట్రేషన్, కొత్తగా జారీ చేసిన జిఓ ప్రకారం నివాసిత ఇళ్లకు పట్టాలిచ్చి హక్కుల కల్పనపై ఈనెల 3న శనివారం సాయంత్రం 4గంటలకు తోటగరువు వెర్ని దుర్గమాంబ కల్యాణమండపంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్డిఒ, తహశీల్దార్, ఇతర, రెవెన్యూ అధికారులు హాజరుకానున్నారు. గతంలో ఇచ్చిన చంద్రన్న పట్టాలలో తప్పులు సరిచేయుట, కొత్తగా పట్టాలకు దరఖాస్తులు స్వీకరణ, సందేహాల నివృత్తికి అవకాశం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక టిడిపి నాయకులు కోరారు.

ఫెర్రో ఎలక్ట్రిక్ మెటీరియల్స్పై గీతంలో ఎఫ్డిపి



'గీతం'లో పిపిఎంఎస్ ప్రారంభిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-మధురవాడ : పదార్ధ విజ్ఞానంలో పరిశోధనలకు కీలకంగా ఉపయోగించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఫిజికల్ ప్రాప్రర్టి మెజర్మెంట్ సిస్టమ్ (పిపిఎమ్ఎస్), డ్రై ఎలక్ట్రిక్ పోలరైజేషన్ ఎలక్ట్రిక్ ఫీల్డ్ లూప్ ట్రేసర్లను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మూర్తి ప్రయోగశాలలో నూతనంగా నెలకొల్పారు. భారతప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్టి) సహకారంతో ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ సైంటిఫిక్ ఎక్సలెన్స్(పర్స్) ప్రాజెక్టులో భాగంగా నూతన సాంకేతిక పరికరాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలోని పరిశోధకులకు, అధ్యాపకులకు గీతంలో ఫ్యాకల్టీ డవలప్మెంట్ (ఎఫ్డిపి) కార్యక్రమం నిర్వహించారు. ఎక్సపరిమెంటల్ టెక్నిక్స్ ఫర్ మేగ్నటిక్ అండ్ ఫెర్రో ఎలక్ట్రిక్ మెటీరియల్స్ అనే అంశంపై జరిగిన ఎఫ్డిపిలో ప్రఖ్యాత పరిశోధన సంస్థలు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నిపుణుడు ప్రొఫెసర్ అభిషేక్ మండల్, యుజిసి,డిఎఇ నిపుణులు ప్రొఫెసర్ ముకుల్గుప్తా, ప్రొఫెసర్ సుధీంద్ర రాయప్రోలు, ప్రొఫెసర్ పి.డి.బాబు, ప్రొఫెసర్ వి.రాఘువేందర్ హజరై పసంగించారు.గీతం మూర్తి ప్రయోగశాలలో నెలకొల్పిన పిపిఎంఎస్ పరికరంపై ఏ విధమైన పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించవచ్చో ప్రాక్టికల్ శిక్షణ అందించారు. గీతం విశిష్ట ప్రొఫెసర్, మూర్తి ప్రయోగ శాలల అధిపతి ప్రొఫెసర్ బివిఆర్ టాటా మాట్లాడుతూ రూ. 60 కోట్లతో ఎన్ఎంఆర్ వంటి అధునాతన పరికరాలతో గీతం మూర్తి ప్రయోగశాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వీటితో దేశం గర్వించ తగ్గ పరిశోధనలు చేపట్టాలని కోరారు. కార్యక్రమానికి గీతం ఫ్యాకల్టీ డవలప్మెంట్ సెల్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్ శర్మ, ప్రొఫెసర్ జి.రవికుమార్ సంధానకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గీతంతో పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఎన్ఐటి తాడేపల్లి గూడెం, ఐఐటి తిరుపతి, జెఎన్టియు విజయనగరం, ఐఐటిడిఎమ్ కర్నూలు నుంచి అధ్యాపకులు హజరయ్యారు.

మాధవ యువజన సమాజం వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న రాంగోపాలరావు

ప్రజాశక్తి -మాధవధార : శ్రీ మాధవ యువజన సమాజం 79వ వార్షికోత్సవాన్ని మాధవధార భరద్వాజ క్షేత్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన సమాజం కన్వీనర్ సనపల రామ్గోపాలరావు మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే మాధవ యువజన సమాజాన్ని స్థాపించి, మాధవధార గ్రామాభివృద్ధికి స్థానిక పెద్దలు తమ సొంత ఆస్తిపాస్తులు దానం చేశారన్నారు. మాధవ యువజన సమాజాభివృద్ధికి నేటి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వార్షికోత్సవం సందర్భంగా వివిధ క్రీడలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను అందజేశారు. కమిటీ సభ్యులను మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 50వ వార్డ్ కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్, వావిలపల్లి వెంకటరావు, మాధవ యువజన సమాజం సహాయ కన్వీనర్ పప్పల రామచంద్రావు, కమిటీ సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న సిడిపిఒ శ్రీదేవి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని గంభీరం అంగన్వాడీ కేంద్రంలో కిశోరవికాసంపై శుక్రవారం అవగాహన కల్పించారు సిపిపిఒ శ్రీదేవి మాట్లాడుతూ, వేసవి కాలంలో ఈనెల 2 నుంచి వచ్చేనెల 6 వరకు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో 11-18ఏళ్లలోపు బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పోషకాహారం, మానవ అక్రమ రవాణ, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు, సైబర్ నేరాలు, ఆన్లైన్ భద్రతా ఆర్థిక నిర్వహణ తదితర అంశాలపై అంగన్వాడి కార్యకర్తలు అవగాహన కల్పిస్తారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ పి వెంకటరత్నం, ఎంఎస్కె .సంతోష్, కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

పెద్దలను గౌరవించడం సంప్రదాయం

'ఏజింగ్ విత్ డిగ్నిటీ'లో వర్చువల్‌గా పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

ప్రజాశక్తి-కశింకోట : తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం మన సంప్రదాయమని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. వయోజనుల సంక్షేమం కోసం జరిగిన 'ఏజింగ్ విత్ డిగ్నిటీ' కార్యక్రమానికి రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. కేంద్ర సామాజికన్యాయం సాధికారత మంత్రిత్వశాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్‌పోర్టల్ ప్రారంభం, సీనియర్ సిటిజన్స్ హోంవర్కువల్ ప్రారంభోత్సవం, సహాయక పరికరాలు పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం ప్రతిజ్ఞ చేశారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన సీనియర్ సిటిజన్స్ వర్చువల్ ప్రారంభోత్సవంలో భాగంగా అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జి.భీమవరంలో పావని సొసైటీ ఫర్ ది మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ ప్లాస్టిక్స్ వారిచే నిర్వహించనున్న సీనియర్ సిటిజన్ హోంను రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు గతానికి ఒక వారధి లాంటివారని, భవిష్యత్తుకు మార్గదర్శకులని పేర్కొన్నారు. మహిళలు, బాలలు, విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సంక్షేమానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. పదేళ్ల తరువాత ఈ ఏడాది రాష్ట్రానికి కొత్తగా 15 సీనియర్ సిటిజన్ గృహాలు మంజూరైట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డులు అవసరమైన సంబంధిత గ్రామ/వార్డు సచివాలయంలో, లేదా వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయం, ఆన్లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని పొందవచ్చునని తెలిపారు. సంవత్సరానికి రూ.5లక్షల వైద్య బీమా సదుపాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సంచాలకులు ఎ.రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి సత్యనారాయణరావు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు బి.ఆశయ్య, పావని సొసైటీఫర్ ది మల్టిపుల్ హ్యాండీక్యాప్డ్ అండ్ ప్లాస్టిక్స్ నిర్వాహకురాలు డి.రజని, సెక్రటరీ ఎమ్.సత్యవాణి, మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



వర్చువల్‌లో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



చెన్నయ్ ఎంజిఎం ఆసుపత్రిలో పింఛను అందిస్తున్న దృశ్యం

చెన్నయ్ వెళ్లి పింఛను అందజేత

ప్రజాశక్తి-పరవాడ : తమిళనాడు రాష్ట్రం చెన్నై నగరంలోని ఎంజీఎం క్యాన్సర్ హస్పిటల్ చికిత్స పొందుతున్న పింఛను లబ్ధిదారునికి మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పైలా జగన్నాథరావు చొరవతో చెన్నై వెళ్లి పింఛను అందజేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని తానాం ఎస్‌సి కాలనీకి చెందిన నేతల సంతోష్, కుమారి దంపతుల కుమార్తె నేతల సుస్మిత సికిల్ సెల్ ఎనీమీయా అనే వ్యాధి బారినపడి, బోన్ మేరో ఆపరేషన్ నిమిత్తం మూడు నెలల క్రితం చెన్నై ఎంజీఎం క్యాన్సర్ హస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకుంటుంది. ఇది దీర్ఘకాలిక వ్యాధి కావడంతో ఆ బాలికకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.10వేలు పింఛను అందిస్తోంది. అయితే చెన్నై ఆసుపత్రిలో ఉండడంతో గత రెండు నెలలు పింఛను తీసుకోనే వీల్లేకుండా పోయింది. మూడు నెలలు వరుసగా పింఛను తీసుకోకపోతే పింఛను రద్దయ్యే అవకాశం ఉండడంతో ఈ సమస్యను పరవాడ మాజీ జెడ్పిటిసి పైలా జగన్నాధరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానిక సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కెవి శ్రీనివాస్‌తో పైలా జగన్నాధరావు చర్చించి సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ ఎంఎం లక్ష్మణ్‌ను, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు పొట్ల కృష్ణను పైలా జగన్నాధరావు తన సొంత ఖర్చులతో చెన్నై పంపించారు. చెన్నై ఆసుపత్రిలో శుక్రవారం బాధితురాలు సుస్మితకు పింఛను అందజేశారు. దీనిపై బాలిక తల్లితండ్రులు సంతోష్ వ్యక్తం చేస్తూ పైలా జగన్నాధరావుకు, సర్పంచ్, సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విశాఖ కెజిహెచ్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ

కశింకోట : విశాఖపట్నం కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన పింఛను లబ్దిదారు ముప్పిన సూరిబాబుకు శుక్రవారం సచివాలయం హెల్త్ సెక్రటరీ సువర్ణ విశాఖ కెజిహెచ్‌కు వెళ్లి పింఛను రూ.8వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఉపాధ్యక్షులు కలగ సోమేశ్వరరావు, గ్రామ కార్యదర్శి కరక సోమునాయుడు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

వేతన బకాయిలు చెల్లించరూ..

ప్రజాశక్తి-అనకాపల్లి

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో నడుస్తున్న 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లకు నాలుగు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, వారి సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం ఎన్టీఆర్ వైద్యాలయం ముందు నిరసన తెలియజేశారు. 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ 10 ఏళ్లుగా కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా ఉన్నారన్నారు. ఈ సమస్యలు పరిష్కారం చేయడంలో అరవిందో యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 4 నెలల నుంచి జీతాలు లేకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు, ఇంక్రిమెంట్లు, పని ఒత్తిడి తదితర డిమాండ్లను మే 20వ తేదీ లోపు పరిష్కరించకుంటే మే 20 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులు చర్చలు జరిపి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నర్సింగరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిసిసిబి చైర్మన్ తాతారావుకు అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన గాజువాక జనసేన ఇన్చార్జ్ కోన తాతారావును జిల్లా యాదవ సంఘం ప్రతినిధులు శుక్రవారం కలిసి అభినందనలు తెలియజేశారు. ఉమ్మడి విశాఖ కోఆపరేటివ్ బ్యాంకుల అభివృద్ధికి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు డాక్టర్ చిన్నియాదవ్, బోడి వెంకట్రావు, బర్నికాని శ్రీనివాస్, బొబ్బిలి గోవిందరాజు, పల్లా సత్య అప్పారావు, సారిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన పట్ల హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం కులగణన సర్వే చేసేందుకు నిర్ణయం తీసుకోవడం పట్ల ఆలిండియా బిసి ఫెడరేషన్ ఉమ్మడి విశాఖజిల్లా అధ్యక్షులు విల్లూరి పైడారావు శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దీని వల్ల ఎస్టి ఎస్సి, బిసి మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కులగణన సర్వే విజయవంతం చేయాలని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని గణాంకాలు తయారు చేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కలెక్టర్ విజయకృష్ణన్ శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో అభినందించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెజిబివి విద్యాలయాలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో పదవతరగతి ఫలితాలలో రెండవ స్థానం, ఇంటర్మీడియెట్ ఫలితాలలో మొదటిస్థానం సాధించడం అభినందనీయమన్నారు. వచ్చే సంవత్సరం కూడా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఎస్ఎస్ఎ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటరు ఆర్. జయప్రకాష్ మాట్లాడుతూ జిల్లాలోని 20 పాఠశాలలకు 8పాఠశాలలో నూరుశాతం ఉత్తీర్ణత, ఇంటర్మీడియెట్ ఫలితాలలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం, 20 కళాశాలలకుగాను 5కళాశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. టెన్త్‌లో 550పైగా మార్కులు సాధించిన 40 మంది పదవతరగతి విద్యార్థినులను, ఇంటర్‌లో 950 పైగా మార్కులు సాధించిన విద్యార్థినులు, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సత్కరించారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఏలూరు జిల్లా అగిరిపల్లి హిల్ పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి ఒలింపిక్ ఆటల పోటీలలో ఉత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెజివిబిల ప్రిన్సిపాల్స్, విద్యార్థినుల తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



వడ్డాది కెజిబివి విద్యార్థిని శ్రీలాస్యను అభినందిస్తున్న కలెక్టర్

వడ్డాది కెజిబివి విద్యార్థినులకు...

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కేజీబీవీ స్కూల్లో ఈ విద్యా సంవత్సరంలో పదోతరగతి ఫలితాల్లో 560 మార్కులు సాధించిన బంగారుమెట్ట గ్రామానికి చెందిన కడియం శ్రీలాస్యని, ద్వితీయ స్థానం వచ్చిన ఎం.కృష్ణవేణి, మౌనికలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపల్ అన్నపూర్ణ, చైర్మన్ ఎడ్ల సత్యవేణి, ఎడ్ల రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంత నిర్లక్ష్యమా..?

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలో నాలుగైదు గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతున్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఒక రావిచెట్టు పూర్తిగా మూసేసింది. పైన ఉన్న విద్యుత్తు తీగలకు కొమ్మలు తగులుతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. మండల కేంద్రం కె.కోటపాడు సబ్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ స్తంభం దర్శనమిస్తోంది. ఈ స్తంభానికిపైన హైటెన్షన్ వైర్లు రెండు వరుసలో ఉన్నాయి. ప్రతి నెల మెయింటినెన్స్ పేరుతో ఒక రోజంతా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుంది. ఆ సమయంలో విద్యుత్‌తీగల కింద ఉన్న చెట్టుకొమ్మలను తూతూ మంత్రంగా సిబ్బంది తొలగిస్తుంటారు. మరి ఇక్కడ మాత్రం ఎందుకు పట్టించుకోలేదని ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విద్యుత్ స్తంభం చివర వైర్లు తాకే వరకు పెరిగిన రావిచెట్టు

ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద స్థలంపై సర్వే

ప్రజాశక్తి- చోడవరం : చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మూడు శాఖలకు చెందిన ఉమ్మడి స్థలాన్ని శుక్రవారం అధికారులు సర్వే చేపట్టారు. చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కొన్నాళ్లుగా దేవాదాయశాఖ, పంచాయితీ, ఆర్టీసీ శాఖలకు చెందిన స్థలంపై వివాదం నడుస్తోంది. పెద్దచెరువుకు ఆనుకుని ఉన్న కొంతస్థలాన్ని ఆర్టీసీ తమదని గత ఆరు నెలల క్రితం ఆప్షన్ వేసి లీజుకు ఇచ్చింది. దీనిపై స్థానిక పంచాయతీ అధికారులు ఈ స్థలం కొంత భాగం పంచాయతీకి చెందినదని లీజుకి ఇవ్వడానికి వీల్లేదని సిమెంట్ స్తంభాలతో ఫెన్సింగ్ వేశారు. దీంతో సదరు లీజుకి తీసుకున్న వ్యక్తులు పనులను నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖకు చెందిన స్థలం ఎంత ఉన్నది అన్న వివరాలు తెలుసుకోవడానికి ఆ శాఖకు సంబంధించిన అధికారులు రెవెన్యూ అధికారులను కోరడంతో ప్రస్తుతం మూడు శాఖల సమన్వయంతో సర్వే చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణరావు సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న అధికారులు



అదృశ్యమైన తల్లీబిడ్డలను మీడియా ముందు చూపుతున్న దృశ్యం

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఏప్రిల్ నెల 24వ తేదీన బుచ్చయ్యపేట పోలీసుస్టేషన్లో నమోదైన అప్పంపాలెం గ్రామానికి చెందిన ఒక వివాహిత ఇద్దరు పిల్లల అదృశ్యం కేసును బుచ్చయ్యపేట పోలీసులు ఛేధించారు. సాకేంతిక పరిజ్ఞానం ఉపయోగించి కనిపెట్టారు. వారి కుటుంబసభ్యులకు వారిని బుచ్చయ్యపేట ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం అప్పగించారు. కనిపించకుండా పోయిన వారు తిరిగి రావడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి సందర్భంగా సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్, పదవతరగతిలో అత్యున్నతస్థాయిలో మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను శుక్రవారం ప్రదానం చేశారు. పట్టణ మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై పి.రాములమ్మ చేతుల మీదుగా వారికి ప్రతిభా ప్రశంసా పత్రాలు, సిద్దార్థ మెరిట్ మెడల్స్ అందజేశారు. సంస్థ అధ్యక్షులు బల్లా నాగభూషణం మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఆధ్వర్యాన గత 12 సంవత్సరాలుగా ఉత్తమ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పట్నాల కృష్ణమోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తుర్తి రామారావు, బొడ్డు సోమరాజు, నందేల అప్పారావు, ఊడా నాగేశ్వరరావు, ఉజ్జి సత్యనారాయణ పాల్గొన్నారు.

కిశోర బాలికల సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ ధర్మారాయుడుపేటలో కిశోర వికాసం వేసవి సెలవులు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్న మాట్లాడుతూ కిశోర బాలికల సాధికరత మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. కిశోర బాలికలు మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని, సమాజంలో పద్ధతిగా ఉండాలని సూచించారు. శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మహిళా పోలీస్‌అధికారి రామిడి జయంతి మాట్లాడుతూ కిశోర బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యదర్శి కావలి ఉమా, పైల సరస్వతి, చెబ్రోలు కళ్యాణి, ఊడి హైమాదేవి పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

ప్రజాశక్తి- దేవరాపల్లి : వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలతో రైతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖాధికారి ఎల్.వై.కాంతమ్మ తెలిపారు. మండలంలో సీతంపేటలో అదిరెడ్డి ఆచ్చియుడు అనే రైతు టిసిజిఎస్-1694 వశిష్ఠ అనే వేరుశనగ రకం వేసిన పొలంలో కొండెంపూడి నుండి వచ్చిన శాస్త్రవేత్తలు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ సౌజన్య, డాక్టర్ సత్తిబాబు, బందం శుక్రవారం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట వేసిన దగ్గర నుండి తీసే వరకూ పంటను ప్రతినెలా పరిశీలిస్తూ ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో సూచించామని, మేము చెప్పిన విధంగా ఆయన అమలు చేసినందున ఈ రోజు ఒక ఎకరానికి 60 కేజీల విత్తనాలు నాటగా 1200 వందల కేజీలకు పైగా దిగుబడి వచ్చిందని తెలిపారు. రూ.23,600 ఖర్చులు పోగా రూ.50,000 పైగా మిగులుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఈఒ కిరణ్‌కుమార్ ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలు చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- విధులను బహిష్కరించి ఆందోళన కొనసాగింపు
- నిలిచిపోయిన 42 బస్సులు



ఆర్టీసీ డిపో వద్ద ఆందోళన చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో అద్దె బస్సుల డ్రైవర్లు విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. దీంతో శుక్రవారం 42 అద్దె బస్సులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్ల ఒప్పంద కాల పరిమితి ముగిసి ఏడు నెలలు కావస్తున్నా వేతనాలు పెంచకపోవడం శోచనీయమన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, వెయ్యి రూపాయల బోనస్ ఇవ్వాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డోర్ హ్యాంగింగ్‌లో ప్రయాణికులు జారిపడి మరణిస్తే దానికి డ్రైవర్లను బాధ్యులను చేసి విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా అమలు చేయాలని, డ్రైవర్లపై వేధింపులు ఆపాలని, అద్దె బస్సు డ్రైవర్లకు జిల్లా పాసులు మంజూరు చేయాలని, ఏడాదికి రెండు జతల యూనిఫామ్‌లను ఇవ్వాలని కోరారు. దీనిపై మూడు నెలలుగా ఆందోళన చేస్తున్నా బస్సుల యాజమాన్యాలు పట్టించుకోక పోవడంతో సమ్మెబాట పట్టాల్సి వచ్చిందని చెప్పారు.

జిల్లా రవాణా అధికారి నిర్లక్ష్యం

42 అద్దె బస్సుల డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బస్సులను నిలిపివేసి నిరసన చేపట్టిన నేపథ్యంలో జిల్లా రవాణా అధికారి, అనకాపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించకపోవడం శోచనీయమని డ్రైవర్లు పేర్కొన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వెంటనే పర్కిరించాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి శ్రీనివాసరావు, అద్దె బస్సుల డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలక సత్యనారాయణ, యూనియన్ నాయకులు ఆర్. నాగేశ్వరరావు, జి. శ్రీనివాసరావు, ఎంపీ నాయుడు అప్పారావు శివ, బి. చిన్నారావు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లు విధులు బహిష్కరించడంతో నిలిచిపోయిన అద్దె బస్సులు

సిహెచ్ఒల సమస్యలను పరిష్కరించాలి

నాలుగో రోజు కొనసాగిన ఆందోళన

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు పదివేల మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సిహెచ్ఒ) సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. తమ సమస్యలపై గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న సిహెచ్ఓలు శుక్రవారం నిరసన దీక్షను ప్రారంభించారు. వీరి దీక్షలకు నేషనల్ హెల్త్ మిషన్, ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్ యూనియన్ రాష్ట్ర నాయకులు వినోద్, సందీప్ మద్దతు తెలియజేశారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పుడే ఆరేళ్ల తర్వాత రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు దాటిన ప్రతి సిహెచ్ఓలను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని, ప్రతి సంవత్సరం 5శాతం ఇంక్రిమెంట్, పని ఆధారత ప్రోత్సాహకాలు, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని కోరారు. విధి నిర్వహణలో పలువురు సిహెచ్ఓలు మృతి చెందడం జరిగిందని, వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లభించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కార్యక్రమానికి మద్దతు తెలియజేసిన ఏపీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సిహెచ్ఓల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఎంసీఏ స్టేట్ కోఆర్డినేటర్ యస్.వినోద్ కుమార్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిజసందీప్ కుమార్. హెచ్ఓలు జి.భవాని, జి.యమున, కె అశ్విని, టి కళ్యాణి, బి.సుధాకర్, ఆర్.అప్పలనాయుడు, పి.రాజశేఖర్, సి హెచ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

డిప్లొమా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత వస్త్ర పరిశ్రమల శాఖ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీలో 53 సీట్లు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. 3 సంవత్సరముల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశం కొరకు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై, జూలై నెల 1వ తేది నాటికి బిసి, జనరల్ కేటగిరీలకు చెందిన వారు 15 నుండి 23 సంవత్సరాల మధ్య వయసు, ఎస్‌సి, ఎస్‌టి వారు 25 సంవత్సరాల వరకు వయస్సు వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. లేటరల్ ఎంట్రీ మూడు సంవత్సరాల డి.హెచ్.టి.టి కోర్సు నందు, ఇంటర్మీడియట్ ఎంపీసీ ఇంటర్మీడియట్ ఒకేషనల్ (టెక్స్టైల్స్), ఐటిఐ (2 సంవత్సరములు) కోర్సులందు ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశము కల్పించడం జరుగుతుందని తెలియజేశారు. ఇతర వివరాలు, దరఖాస్తు పొందుటకు www.jihtvgr.com వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు. అప్పరెల్ అండ్ గార్మెంట్ మేకింగ్ టెక్నాలజీలో ఏప్రిల్ 21 నుండి జూన్ 1వ తేదీ ఉచిత శిక్షణ కూడా ఇస్తున్నట్టు తెలియజేశారు. ఇతర వివరాలకు 08625-295003, 9399936872, 9866169908, 9010243054 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రావాడ రెవెన్యూలో రీ సర్వే

ప్రజాశక్తి- పరవాడ : రావాడ పంచాయతీలో రీసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్‌బాబు సోదరులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పంచకర్ల ప్రసాద్ హాజరయ్యారు. సర్వేనెంబర్ 1లో పూజా కార్యక్రమం నిర్వహించి సర్వే ప్రారంభించారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా రైతులకు నష్టం కలగకుండా, సర్వేని నిజాయితీగా పూర్తి చేయాలని అధికారులకు పంచకర్ల ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అంబేద్కర్, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపుచిన్న, సర్పంచ్ మొటూరు సన్యాసి నాయుడు, సారిపల్లి జోగినాయుడు, కావలి అప్పలనాయుడు, శ్రీనివాస్, డిప్యూటీ తహశిల్దార్, మండల సర్వేయర్, విఆర్ఒ సాయికిరణ్, 14 టీమ్స్ సర్వేయర్స్ పాల్గొన్నారు.

గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం రూరల్ : చోడవరం మండలంలో అధికార, ప్రతిపక్ష నాయకులు చేస్తున్న గ్రావెల్, ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు మైనింగ్ మాఫియాతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మండలంలోని నరసాపురం, గవరవరం, ఖండేపల్లి, భోగాపురం తదితర గ్రామాల్లో కొంతమంది అధికార పార్టీ అండదండలతో కొండలను తవ్వేస్తున్నారని, శారదా, బొడ్డేరు, పెద్దరు నదుల్లో ఇసుక ఆక్రమ తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు మామూళ్లు తీసుకొని వీటిపై నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారపార్టీ ఎమ్మెల్యే అండదండలతో 4 జెసిబిలు టిప్పర్ లారీలతో రాత్రి 10 గంటల నుంచి గ్రావెల్‌ను లేఅవుట్లకి తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి


ప్రజాశక్తి-పరవాడ : ప్రజాప్రతినిధులు, అధికారులు అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ఎంపిపి ఎంపీపీ పైల వెంకటపద్మ లక్ష్మీ శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. గత సమావేశంలో ప్రజాప్రతినిధులు అడిగిన సమస్యలపై ఈ సమావేశంలో వివరణ ఇస్తూ, వాటి సమాధానాలపై అన్ని శాఖల అధికారులు వారి నివేదికను చదివి వినిపించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్య, ఆరోగ్య, గ్రామీణ నీటి సరఫరా, గృహనిర్మాణ, తదితర శాఖలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుండి మండలంలో వున్న ప్రతి ఎంపీటీసీకి సుమారు రూ.10లక్షలు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం తెలపడం జరిగిందని, ఆ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. 10వ తరగతి ఫలితాలలో పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లాలో మొదటి, రెండో ర్యాంకులు సాధించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీడీఓ ధర్మారావు, పరవాడ ఎంఆర్ఒ అంబేద్కర్, పరవాడ మండలం వైస్ ఎంపిపిలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

సాయినగర్ కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-పరవాడ : గ్రేటర్ విశాఖ 79వవార్డు పరిధి దేశపాత్రునిపాలెం సాయినగర్ కాలనీకి వెళ్లే రహదారి చీకటిగా ఉందని గుర్తించి స్థానిక కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ కొత్తవీధిలైట్లును శుక్రవారం వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దఫా దఫాలుగా వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని త్వరలో కొత్త పోల్స్, లైట్లు వేయిస్తానని హామీ ఇచ్చారు.

అస్తవ్యస్త డ్రెయినేజీతో అవస్థలు

-మురుగునీటి కాలువల్లో నిలిచిన చెత్తా చెదారం
-పట్టించుకోని అధికారులు
-ఇబ్బందులు పడుతున్న సీతారామరాజునగర్ కాలనీ వాసులు



డ్రెయినేజీలో చెత్తాచెదారం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలోని సీతారామ రాజు నగర్ మురుగునీటి కూపంలా మారింది. ఇక్కడ సుమారు 1000 మంది వరకు జనాభా నివశిస్తున్నారు. సీతారామరాజు నగర్‌లో గడిచిన దశాబ్ద కాలంగా వీధుల్లో మురుగు నీటి కాలువల్లో చెత్తా చెదారం నిలిచి పోయింది. దీంతో, మురుగు నీరు పారేందుకు అవకాశం లేక పోవడంతో కాలువలు దుర్గంధంగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడి కక్కడే చెత్తా చెదారం నిలిచి పోవడంతో దుర్గంధంతో పాటు దోమల బెడదతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు, నాయకులకు చెప్పినా పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సదరు కాలనీ నుంచి ఎక్కువగా ఇంటి పన్నులు పంచాయతీకి అత్యధికంగా వస్తున్నా పట్టించుకోలేదని వారు వాపోయారు. కాలనీలో గల మూడు రోడ్లు నుండి ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఆర్అండ్‌బి కాలువలోకి మురికిని నీరు వెళ్ళవలసి ఉంటుంది. ఆ కాలువ ఆక్రమణకు గురికావడంతో నీరు ఎటు కదలక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం సీజన్లో కాలనీ ముంపునకు గురవుతోంది. తూతూ మంత్రంగా నివారణ చర్యలు చేపడుతున్నరే గాని ఆక్రమణకు గురైన కాలువను పట్టించుకునే నాథుడే లేడు. కాలువలు శుభ్రపరచక పోవడంతో మురుగు నీరు ఎటు కదలక మురుగు కూపంలా మారింది. కొన్ని ప్రాంతాలలో మురుగునీరు ఇళ్లలోకి కూడా ప్రవేశిస్తుంది. వర్షం అధికంగా కురిస్తే కాలువలు పొంగి రోడ్లపై నుంచి ప్రవహిస్తూ ఉంటాయి. అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల కాలనీవాసులు అధికారులు నాయకులు తీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా కాలనీలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



డ్రెయినేజీలో నిలిచిన మురుగనీరు



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-కోటవురట్ల:బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని నివారించేందుకు సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ కనకదుర్గ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో రత్నాలపాలెం వద్ద అంగన్వాడీ సెంటర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకోవడంతో కలిగే అనర్ధాలను వివరించారు. అంగన్వాడి కార్యకర్తలు కూడా బాల్య వివాహాల నివారణ పై ప్రచారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

పశువులకు నీటి తొట్టెలు నిర్మించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టెలను నిర్మించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామ్మోహనరావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో పశువైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. నీటి ఎద్దడి గల ప్రాంతాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మాణాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో పాలు, గుడ్లు మాంసం, ఉత్పత్తి పెంచేందుకు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా పాడి రైతులకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుం టామన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నరేష్, పలువురు పశు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

4న మోదమాంబ పండగ

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని ఎం.కోడూరు గ్రామ దేవత మోదమాంబ అమ్మవారి పండగ ఈనె 4న ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేకపూజలు చేయనున్నామన్నారు. ఆలయంకు వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పలు సౌకర్యాలు, ఉచిత ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. ఆదివారం రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

7 నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల గ్రామంలో వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 7వ తేదీ నుండి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎస్‌వివి సత్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 8న గురువారం సాయంత్రం 6గంటలకు కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించబడునని తెలిపారు. దంపతులు తమ పేర్లను ఆలయ అర్చకుని వద్ద నమోదు చేయించుకోవాలన్నారు.



పరిశీలిస్తున్న శిరీషారాణి, నాగలక్ష్మి

సంపద తయారీ కేంద్రాలతో ఆదాయం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలో వడ్డాదిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ విస్తరణ అధికారి శిరీషారాణి, జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాన్ని సమర్థవంతంగా వినియోగించి ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. సంపద తయారీ కేంద్రంలో తయారవుతున్న ఎరువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈవో లవరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లిముల భూమి అన్యాక్రాంతం కానివ్వం



ముస్లిం పెద్దలతో కలిసి మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని పెదబోధిగల్లం లో ముస్లింలకు చెందిన పీర్ల మాన్యం భూమి అన్యాక్రాంతం కానివ్వబోమని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. శుక్రవారం పెదబోధిగల్లం గ్రామంలో ముస్లిం పెద్దలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పెదబోధిగల్లం గ్రామంలో కారిడార్ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకుగాను ఏపీఐఐసీ అధికారులు 151 ఎకరాలు భూమి రైతుల నుండి సేకరించడం జరిగిందన్నారు. సేకరించిన భూమిలో సర్వేనెంబర్ 143/2 లో 3 ఎకరాల 6 సెంట్లు భూమిని 1912 వ సంవత్సరంలో చల్లా సత్యనారాయణ ముస్లింలకు పీర్ల మాన్యానికి ఇవ్వడం జరిగిందన్నారు. అప్పట్లో ఆ భూమిని ఒక పెత్తందారుడు కొంతమందికి శిస్తుకు ఇవ్వగా, శిస్తుకు తీసుకున్న వారి వారసులు తప్పుడు రికార్డులు సృష్టించుకుని ఆ భూమిని కాజేయాలని ప్రయత్నించగా, గతంలో గ్రామస్తులందరూ రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. అధికారులు ఆ భూమిని పరిశీలించి, ఆ భూమి పీర్ల మాన్యానికి సంబంధించిందని తెలియజేయడం జరిగిందన్నారు. అయినప్పటికీ వారంతా ఆ భూమిని కాజేయ్యాలని చూస్తున్నారని, ఈ సమస్యను హెూం మంత్రి అనిత, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి భూమి అన్యాక్రాంతం కాకుండా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మున్నిషా బేగం, ముస్లిం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కొత్తకోట:రావికమతం మండలం చీమలపాడు శివారు చలిసింగం గ్రామానికి నిర్మిస్తున్న తారు రోడ్డు నిర్మాణ పనులను చోడవరం జనసేన ఇన్ఛార్జి పి.వి.ఎస్.ఎన్. రాజు, ఆపార్టీ నాయకుల బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణనికి సుమారు రూ.2.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం సీకాయపాడు నుంచి చలిసింగం వరకు కొండలు మధ్యలోంచి మట్టి రోడ్డు ఫార్మేషన్ పనులు జరుగుతున్నాయన్నారు. రెండో దశ పనులను త్వరలో చేపట్టి రోడ్డు నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమం లో రావికమతం, రోలుగుంట మండలాల జనసేన మండల పార్టీ అధ్యక్షులు మెచర్ల నాయుడు, బలిజ మహరాజు, చింతల కిషోర్, పరవాడ దొరబాబు, కె.అప్పారావు, కోన రమణ. విటంశెట్టి ఈశ్వరరావు, సోమిరెడ్డి శివ శంకర్, గాంధీ, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న జనసేన నాయకులు రాజు, తదితరులు

బిసి కులగణనపై పోరాటానికి దిగొచ్చిన కేంద్రం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) పోరాటానికి కేంద్రప్రభుత్వం దిగొచ్చి బిసిల కులగణన చేపడతామని కేంద్రమంత్రి ప్రకటించడం జరిగిందని బిఎస్పి పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొట్టా నాగరాజు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాటట్లాడారు. బీసీల సమస్య ఈ భారత దేశ సమస్య అని మాన్యశ్రీ కాన్షిరామ్ అనేక సందర్భాల్లో చెబుతూ ఉద్యమాలు చేశారన్నారు. గతంలో తమ పార్టీ చీఫ్ మాయావతి నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఆధ్వర్యంలో కులగణన చేయాలని పెద్ద ఎత్తున ఆందోళన చేయడం జరిగిందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా బీసీల కుల గణన చేయాలని ఆందోళన చేయడం జరిగిందన్నారు. దీని ఫలితంగానే పోరాటం ఫలించిందన్నారు. ఈ ఉద్యమ ఫలితంగా బీసీ కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి నాయకులు కొల్లి గంగాధర్, ఎన్.చిరంజీవి పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-అనంతగిరి:ఎలుగుబంటి దాడిలో ఓ గిరిజనుడు తీవ్రంగా గాపడ్డాడు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ బుర్దగడం గ్రామానికి చెందిన తామర్ల జానకిరామ్ (55) శుక్రవారం అటవీ ప్రాంతంలో వెళుతుండగా అతడిపై ఎలుగుబంటి దాడికి పాల్పడింది. 108 అంబులెన్స్ లో ఎస్.కోట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-రావికమతం : రైతులు భూసార పరీక్షలను చేయించుకోవాలని రావికమతం వ్యవసాయ అధికారిని రూప తెలిపారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, బీడు బారిన పంట పొలాలు, చౌడు భూములు, పంట నాణ్యత కోల్పోయిన భూములలో మట్టిని సేకరించి రైతు భరోసా కేంద్రాల ద్వారా మట్టి పరీక్షను చేయించుకోవాలన్నారు. దీంతో భౌతిక, జీవ లక్షణాలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. నేలలో సహజంగా ఉండే పోషకాల స్థాయిని, ఆమ్ల, క్షార స్థాయిని, తేమను అంచనా వేయవచ్చు అని తెలిపారు. ఈ పరీక్షల ద్వారా పంటల దిగుబడిని పెంచడానికి, ఎరువుల మోతాదును సరిగ్గా నిర్ణయించడానికి ఉపయోగపడతాయన్నారు.రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొండ ప్రాంతంలో విద్యుత్ లైన్లు ఏర్పాటు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని పట్టాం పంచాయతీ 10 గ్రామాల్లో నూతనంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. గాలి వర్షాలకు విద్యుత్ వైర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరిగా ఉండక పోవడంతో ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడేవారు. కరెంటు విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి మూడు రోజులుగా సిబ్బంది గ్రామ పెద్దలు సహాయంతో నూతనంగా వైర్లను ఏర్పాటు చేస్తున్నారు. కుమార్ పుట్టు నుంచి పెదపాడు జంక్షన్ వరకు ఏడు కిలోమీటర్లు వరకు నూతన వైర్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టం లైన్మెన్ జగన్నాథం, మాజీ సర్పంచ్ రాజారావు, గ్రామ పెద్దలు బూరు గుండన్న, అప్పారావు పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లు, డ్రైవర్ల నిరసన



నర్సీపట్నంలో ఆందోళన చేస్తున్న నాయకులు, డ్రైవర్లు

ప్రజాశక్తి - నర్సీపట్నం టౌన్:తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ కెప్టెన్స్, డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు రూ.8,800 జీతం మాత్రం చెల్లిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలన్నారు. 2015 నుంచి వీరు సర్వీసులో ఉన్నారన్నారు. అప్పటి నుంచి నామమాత్రపు వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. యాజమాన్యం చెల్లించాల్సిన ఈఎస్ఐ, పీఎఫ్‌లు కూడా కార్మికుల వేతనాల నుంచి కోత విధిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ గుర్తించి కనీస వేతనం రూ.18వేలు అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమణ, కృష్ణ, బాస్కరరావు, కనకరాజులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం విశాఖ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి మాట్లాడుతూ 2015లో ప్రారంభించబడ్డ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ సర్వీసుకు నేటితో తొమ్మిది సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. ఈ 102 సర్వీస్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు కేవలం రూ.8800 వేతనం చెల్లించడం చాలా అన్యాయమన్నారు. అరబిందో సంస్థకు ఈ సర్వీస్‌ను నిర్వహించే బాధ్యతను గత రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పిందన్నారు. వారు గడచిన నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించలేదన్నారు. గత నెలాఖరుతో అరబిందో సంస్థతో చేసుకున్న ఒప్పందం పూర్తయినప్పటికీ వేతనాలు చెల్లించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బాలింతలకు ఎంతో ఉపయోగకరమైన ఈ సర్వీసును నేరుగా నిర్వహించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కనీస వేతనం చట్టం ప్రకారం రూ.18,500 చెల్లించాలని, యాజమాన్యం పిఎఫ్ వాటా ప్రభుత్వమే చెల్లించాలని, వాహనాల మరమ్మతులు తక్షణం చేపట్టాలని, నాలుగు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు వైఎస్.సతీష్, కోశాధికారి బి.రాజులు, ఉపాధ్యక్షులు ఎం.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి జి.నర్సింగరావు పాల్గొన్నారు.



విశాఖలో ఆందోళన చేపడుతున్న డ్రైవర్లు

మన్యం బంద్ జయప్రదం

-ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి కోసం గళమెత్తిన గిరిజనులు
-స్తంభించిన రవాణా వ్యవస్థ
-మూతపడిన ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక కేంద్రాలు, దుకాణాలు



పాడేరులో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

ప్రజాశక్తి-పాడేరు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నిరవధిక రాష్ట్ర మన్యం బంద్ తొలి రోజు శుక్రవారం అల్లూరి జిల్లాలో విజయవంతం అయ్యింది. జిల్లాలోని పాడేరు రంపచోడవరం డివిజన్లోని అన్ని మండలాల్లో బంద్ ప్రభావం కనిపించింది. ప్రైవేట్, ఆర్టీసీ రవాణా వ్యవస్థ నిలిచిపోయాయి. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు నామమాత్రంగానే పనిచేసాయి. ప్రైవేటు విద్యాసంస్థల కార్యాలయాలు అన్ని మూతపడ్డాయి. వారపు సంతలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు, హోటల్లు పూర్తిగా మూతపడ్డాయి. ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ నాయకులు, ఆదివాసి గిరిజన సంఘం నేతలు కిల్లో సురేంద్ర, పి అప్పలనరస, ధర్మన్న పడాల్, బాలదేవ్, సుందర్‌రావు, గిరిజన సమాఖ్య నేత కూడా రాధాకృష్ణ పాడేరు పట్టణం లోని బంద్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బస్సులను వెళ్ళ నివ్వకుండా అడ్డుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి బంద్‌లో పాల్గొని మద్దతు తెలిపారు.

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, ఈ బంద్‌తో కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి ఆర్డినెన్స్ తీసుకు వచ్చి ఆదివాసీ స్పెషల్ డిఎస్సి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్3కి ప్రత్యామ్నాయ చట్టం తెచ్చి గిరిజన ప్రాంత ఉద్యోగాలు 100శాతం గిరిజనులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రీయ ఆదివాసి అధికార్ మంచ్ జాతీయ సభ్యుడు పి అప్పల నరస మాట్లాడుతూ, ఆదివాసీ నిరుద్యోగులతోనే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మెగా డీఎస్సీతో రాష్ట్రంలో ఆదివాసి యువత మూడువేల పోస్టులను కోల్పోతున్నారన్నారు.

అరకులోయ, అరకురూరల్:అరకు లోయలో బంద్ విజయవంతమైంది. అరకులోయలోని దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. టూరిజం హోటల్స్, ప్రైవేటు హోటల్స్, బస్ కాంప్లెక్స్, పెట్రోల్ బంక్ పర్యాటక సందర్శిత ప్రాంతాలైన పద్మావతి ఉద్యానవన కేంద్రం, గిరిజన సంస్కృతిక మ్యూజియం, కాఫీ మ్యూజియంలు మూతపడ్డాయి. పాడేరు, ఎస్ కోట, విశాఖ ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. అరకులోయ టౌన్షిప్‌తో పాటు, ముఖద్వారమైన గ్రీన్ వాలి జంక్షన్ వద్ద ప్రజా సంఘాల నేతలు, డీఎస్సీ అభ్యర్థులు బైఠాయించి పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగిలో ఏపి ఆదివాసీ గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతమైంది. ఈ బంద్‌కు సిఐటియు, యుటిఎఫ్, ఇతర ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు తెలియజేశాయి. బంద్ నేపథ్యంలో వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు తిరగకుండా గిరిజనులు జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు.

రంపచోడవరం : రంపచోడవరం మండలంలో దుకాణాలు, హోటళ్లు పూర్తిగా మూతపడ్డాయి. ప్రైవేటు వాహనాలు, ఆటోలు నిలిచిపోయాయి. బంద్ నేపథ్యంలో ఉదయం నుండి అన్ని గిరిజన సంఘాల నాయకులు అంబేద్కర్ సెంటర్‌కు వద్దకు చేరుకొని ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నూటికి నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని, జీవో 3కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ పాల్గొన్నారు.



అరకులోయలో మూతపడిన మ్యూజియం



విశాఖలో ఆందోళన చేపడుతున్న నాయకులు

మెగా డిఎస్‌సితో ఆదివాసీలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మెగా డిఎస్‌సితో ఆదివాసీలకు తీవ్ర నష్టం జరుగుతోందని, ఏజెన్సీలోని శతశాతం ఉద్యోగాలు గిరిజనులకు దక్కేలా జిఒ 3కి ప్రత్యామ్నాయ ఆర్డినెన్స్ జారీ చేసి ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌సి విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగ ఖాళీలను శతశాతం గిరిజనులతో భర్తీ చేయాలన్నారు. జిఒ 3 రద్దుతో మెగా డిఎస్‌సిలో ఏజెన్సీలోని కేవలం ఆరు శాతం ఉద్యోగాలు మాత్రమే గిరిజనులకు దక్కుతున్నాయని, మిగిలిన 94 శాతం ఉద్యోగాలు గిరిజనేతరుల పరమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు జిఒ 3 ప్రయోజనాలను పునరుద్ధరించి, ఆదివాసీలకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు మాటిచ్చారని, అది అమలు చేయకుండానే మెగా డిఎస్‌సి ప్రకటనతో నిరుద్యోగ గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ఆరు శాతం ఉద్యోగాలకు సుమారు 12 వేల మంది గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు పోటీ పడాల్సి వస్తోందన్నారు. తక్షణమే జిఒ 3కు ప్రత్యామ్నాయంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఆదివాసీ డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జివిఆర్.మూర్తి, గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోరాబు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్, వివిధ పరిశ్రమల ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

మన్యం బంద్‌కు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం మద్దతు

రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం తలపెట్టిన మన్యం బంద్‌కు మద్దతుగా అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి శోభన్ కుమార్, ఉపాధ్యక్షులు ముత్యంగి ప్రసాదరావు, కార్యనిర్వాహక కార్యదర్శి సోమిరెడ్డి బాలగంగాధర్ తిలక్, ట్రెజరర్ సీసా శోభన్, గిరిజన భవన్ ట్రెజరర్ దేపూరి పూజ్య శేఖర్, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్, సీనియర్ సభ్యులు సమరెడ్డి సింహాద్రి, సతక చిట్టయ్య, బి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.